క్లుప్తంగా

పీఆర్ ఈఈ నరేందర్‌రెడ్డికి ఎస్‌ఈగా పదోన్నతి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పంచాయతీ రాజ్ ఈఈ నరేందర్‌రెడ్డికి ఎస్‌ఈగా పదోన్నతి లభించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ఆయన పదోన్నతిపై సిద్దిపేట జిల్లాకు ఎస్‌ఈగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ ఈఈగా ఉన్న విజయ్‌కుమార్‌కు మహబూబ్‌నగర్ ఈఈగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సోమవారం రెగ్యులర్ ఈఈ వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటి దాక విజయ్‌కుమార్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు.

భారత్ వీర జవానులకు టీఎన్‌జీఓ మద్దతు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉగ్రవాదులపై పోరాటం చేస్తున్న భారత్ వీర జవానులకు టీఎన్‌జీఓ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్, కోశాధికారి కృష్ణమోహన్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాద దేశం అయిన పాకిస్తాన్ దాడుల్లో వీర మరణం పొందిన జవాన్ మురళి నాయక్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. యుద్ధ సమయం లో ఉద్యోగులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ముగిసిన ఉత్సవాలు



నవాబుపేట: మండలంలోని లోకిరేవు వీరభద్ర స్వామి ఉత్సవాలు శుక్రవారం ముగిసినట్లు పూజారి లింగయ్య స్వామి తెలిపారు. చివరి రోజు మహా మంగళహారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది రకాల స్వామికి అర్పించినట్లు ఆయన తెలిపారు. ప్రత్యేక అలంకరణలు, ప్రసాదాలతో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఉత్సవాలకు సహకరించిన భక్తులకు, గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గండేడ్: గండేడ్ మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గండేడ్ ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్ తెలిపారు. కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ 132 కేవీ సబ్‌స్టేషన్ రుసుంపల్లి ఫీడర్ పరిధిలోని సాలార్‌నగర్‌లో ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సరఫరా ఉండదని ఆయన తెలిపారు. గుముడాల్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ జిన్నారం ఫీడర్ పరిధిలోని జక్లపల్లిలో ఉదయం ఏడు నుంచి సాయంత్రం 6గంటల వరకు సరఫరా నిలిపేయనున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌కో వారు మెయిన్‌లైన్ ఎర్త్ వైరింగ్ మరమ్మతుల కారణంగా సరఫరా ఉండదన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా వాసవీమాత పూజలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు అమ్మవారికి అభిషేకం చేశారు. ప్రత్యేక అలంకారంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించి లలితా సహస్ర పారాయణం చేశారు. అనంతరం వాసవీమాత పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు.

వృద్ధుడి అదృశ్యం

జడ్చర్ల టౌన్: వృద్ధుడు అదృశ్యమైన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. సీఐ కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శంకరాయపల్లి తండాకు చెందిన అంగోత్ పర్శ (68) ఈనెల 6వ తేదీన ఉదయం టీ తాగేందుకు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మళ్లీ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువులతో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

గట్టు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ ఏపీఎం జయాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్నేహ సంఘం ఆధ్వర్యంలో కిషోర బాలికలకు బాల్యవివాహాల వలన జరిగే అనర్థాలు, పౌష్టికాహార లోపం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం జయాకర్ మాట్లాడారు.

కొనుగోలు కేంద్రాలకు గన్నీబ్యాగులు

- గండేడ్ మండలంలో గన్నీబ్యాగుల కొరత
- 'సాక్షి'లో కథనానికి స్పందించిన అధికారులు
- కోంరెడ్డిపల్లికి 6వేలు, వెన్నాచేడ్‌కు 6,800 గన్నీబ్యాగులు

సాక్షి ఎఫెక్ట్..



వెన్నాచేడ్‌లో గన్నీ బ్యాగులు తీసుకుంటున్న రైతులు

గండేడ్: సాక్షి కథనానికి స్పందన లభించింది. 'గన్నీ బ్యాగుల కొరత' శీర్షికతో సాక్షిలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 12, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 7 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటి పరిధిలోని పలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత ఉంది. బ్యాగులు లేకపోవడంతో ఆరుబయట కొనుగోలు కేంద్రాలో తూర్పారా బట్టి ధాన్యాన్ని కప్పి ఉంచారు. ముందు వచ్చిన బ్యాగుల్లో ఎక్కువ శాతం బ్యాగులు చినిగిపోయి ఉండడంతో కొనుగోలు నిలిచిపోయింది. ఓ వైపు వర్షం భయం, మరో వైపు ఎండ కారణంగా రైతులు ఆందో ళన చెందుతున్నారు. దాదాపుగా పలు కేంద్రాల్లో వారం రోజులుగా గన్నీ బ్యాగులకోసం ఎదురు చూ స్తూ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులను, కొనుగోలు కేంద్రాల నిర్వహకులను అడిగితే ఈరోజు రేపంటూ సమాధానం ఇస్తూ వచ్చారు. ఈవిషయాన్ని రైతులు 'సాక్షి' దృష్టికి తీసుకురావడంతో శుక్రవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో వెంటనే స్పందించిన అధికారులు మండలంలోని కోంరెడ్డిపల్లి ఐకేపీ కేంద్రానికి 6వేల బ్యాగులు, వెన్నాచేడ్ కొనుగోలు కేంద్రానికి 6,800 బ్యాగులు వచ్చాయి. వాటిని పూర్తిగా ఎండి నిర్దేశిత తేమ శాతం కలిగి టోకెన్ పొందిన రైతులకు పంపిణీ చేశారు. శనివారం మరి కొన్ని గన్నీ బ్యాగులు వస్తాయని అధికారులు తెలిపారు.

తండాలోనే బియ్యం పంపిణీ చేయండి



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గుట్టమీది తండా ప్రజలు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని వెంకటాపూర్ హామ్లెట్ గుట్టమీది తండాలోనే రేషన్ బియ్యం పంపిణీ చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన నాటి నుంచి గుట్టమీది తండాలో కాకుండా రేగడి గడ్డ తండాలో బియ్యం పంపిణీ చేస్తున్నారని, తమ తండాలోనే బియ్యం పంపిణీ చేయాలని గుట్టమీది తండా వాసులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి గుట్టమీది తండా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తండాలోనే రేషన్ బియ్యం పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. సందర్భంగా తండా వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టరేట్ పొందిన జానకిరాములుకు సన్మానం



జానకిరాములును సన్మానిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: మండలంలోని బండ్రపల్లి గ్రామానికి చెందిన జానకిరాములు డాక్టరేట్ పీహెచ్‌డీ పొందినందుకు శుక్రవారం దమగ్నాపురం గ్రామంలో ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి జానకిరాములును శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జానకిరాములు వ్యవసాయ కుటుంబంలో పుట్టి చదువుపై శ్రద్ధ వహించి ఉస్మానియ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేయడం అభినందనీయమన్నారు. జానకిరాములును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, తెలుగు వెంకటేష్, గంజి బాల్‌రాజు, కోట్ల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో భాగస్వామ్యం కావాలి

జడ్చర్ల టౌన్: ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో ఉపాధిహామీ కూలీలు, వ్యవసాయ కూలీలు భాగస్వామ్యం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని లింగంపేట, కోడ్గల్ గ్రామాల్లోని ఉపాధి హామీ పని ప్రదేశాలను సందర్శించి కూలీలతో మాట్లాడారు. రోజు రోజుకు ఉపాధి హామీ నిధులు తగ్గిస్తూ కూలీల పొట్టగొడుతున్నారని, కొలతల విధానాన్ని తీసుకొచ్చి కూలి గిట్టుబాటు కాకుండా చేశారన్నారు. నెలలు గడుస్తున్నా కూలీ డబ్బులు ఇవ్వటం లేదని, అందుకే దేశవ్యాప్త సమ్మెలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు భాగ్యమ్మ, యశోద, నరేందర్, మణెమ్మ, పావని, మల్లమ్మ, శ్రీనివాసులు, సంతోష, సులోచనలు పాల్గొన్నారు.

భవిష్యత్ బీఆర్‌ఎస్ పార్టీదే

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- బీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ ఎంపీటీసీ, ముగ్గురు మాజీ సర్పంచులు



హన్వాడ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విసుగు వచ్చిందని భవిష్యత్ బీఆర్‌ఎస్ పార్టీదేనని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో హన్వాడ మాజీ ఎంపీటీసీ యాదయ్య, హన్వాడ మండలం అచ్చుంట తండా మాజీ సర్పంచ్ రాందాస్, అయోద్యనగర్ మాజీ సర్పంచ్ సురేష్, ఎర్రగట్ట తండా మాజీ సర్పంచ్ మన్యనాయక్ లతో పాటు 50మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలుకు సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ జరగలేదని, రెతుబంధు, రైతు బీమా లేదని, కనీసం పండించిన పంట కొనడం దిక్కు లేదని ఆరోపించారు. గ్రామాల్లోకి కాంగ్రెస్ నాయకులు వచ్చినప్పుడు ఎన్నికల హామీలపై నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని, కేసీఆర్ సీఎంగా ప్రజలకు మంచి పాలన అందిస్తారన్నారు. కార్యక్రమం లో హన్వాడ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ నరేందర్, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడుఅన్వర్, సీనియర్ నాయకులు చెన్నయ్య, కొండా లక్ష్మయ్య, శ్రీనివాసులు, అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైనికులకు మద్దతుగా పూజలు



జడ్చర్లలో భారత్ సైనికులకు మద్దతుగా రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ప్రజలు

జడ్చర్ల టౌన్: పాకిస్తాన్‌తో జరుగుతున్న యు ద్ధంలో భారత వీర సైనికులకు మద్దతుగా శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో రేణుకాఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. విశ్వహిందూపరిషత్, సంస్కారభారతి సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. సైనికుల ఆరోగ్యం బాగుండాలని, మేమంతా మీ వెంటే ఉన్నామని మనోధైర్యం వారిలో నింపాలని అమ్మవారిని కోరుకున్నారు. కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ మాతృశక్తి లావణ్య, అలివేలమ్మ, సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికుడికి సన్మానం



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రానికి చెందిన చాంద్ లేడీస్ కార్నర్ నిర్వాహకుడు మహ్మద్ చాంద్ హజ్ యాత్రకు వెళ్తున్న నేపథ్యంలో శుక్రవారం స్థానిక మజీదులో ముస్లింలు సన్మానం చేశారు. హజ్ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసి రావాలని ఆకాంక్షిస్తూ మజీదులో శుక్రవారం ప్రార్థనల తర్వాత శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు టైలర్ ఖాజామైనొద్దీన్, హోటల్ ఖాదర్, టైలర్ కలీం, అబ్దుల్లా, ముక్తార్ హఫీజ్, టైలర్ అబిద్, మదీనా ఖదీర్, ఆరీఫ్, అప్సర్, అర్షద్, ఎజాజ్, తదితరులు ఉన్నారు.

భూదాన భూములు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన నాయకులు

జడ్చర్ల టౌన్: మండలంలోని భూదాన, దేవాదాయ భూములు అక్రమ రిజిస్ట్రేషన్ చేసి వెంచర్లు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బాలకిషన్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మండలంలోని భూదాన, దేవాదాయ భూములైన స.నెంబర్లు 138, 29, 31, 33, 115, 116లలో అక్రమంగా పట్టాలు చేయించుకుని ఆ భూముల్లో వెంచర్లు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పై భూములకు సంబంధించి అక్రమార్కుల పట్టాలు రద్దుచేసి అర్హులైన పేదలకు ఇంటిస్థలాలు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో భవిష్యత్‌లో సీపీఐ, రైతుసంఘం ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటానికి దిగి పేదలతో గుడిసెలు వేయిస్తామన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ, రైతుసంఘం నాయకులు భాగి కృష్ణయ్య, సత్యనారాయణరెడ్డి, పూజ, హన్మంతు, శంకరయ్య, వెంకటయ్య, ఇస్తారయ్య, దాసులు పాల్గొన్నారు.

మొక్కలను ప్రణాళికల ప్రకారం పెంచాలి



తీగలపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాంనాయక్

నవాబుపేట: నర్సరీలను వచ్చే వర్షకాలం నాటికి ప్రణాళికల ప్రకారం పెంచాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని తీగలపల్లి, కాకర్లపహాడ్, సిద్దోటం గ్రామాల్లో నర్సరీలను ఆయన మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రతి గ్రామంలో కొనసాగుతున్న నర్సరీలకు నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. పంచాయతీ అధికారులు, గ్రామాల స్పెషల్ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని ఆయన సూచించారు. మొక్కలు మాత్రం గ్రామాలకు కేటాయించిన టార్గెట్ ప్రకారం పెంచాల్సిందేనని ఆయన సూచించారు. ఆయన వెంట ఏపీఓ జ్యోతి, పంచాయతీ అధికారులు నరేందర్, బాలయ్య, వెంకటేష్, తదితరులు ఉన్నారు.

మూఢ విశ్వాసాలకు దూరంగా ఉండాలి



మహబూబ్‌నగర్ రూరల్: విద్యార్థులు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు అశోక్‌గౌడ్ తెలిపారు. దివిటిపల్లి డబుల్ బెడ్రూం కాలనీలో పి.బాలకిష్టయ్యగౌడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపులో మ్యాజిక్ షో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండి సైన్స్‌ను శాస్త్ర విజ్ఞానాన్ని నమ్మాలన్నారు. మారుతున్న టెక్నాలజీ అనుకూలంగా విద్యార్థులు మెలగాలని తెలిపారు. పేద విద్యార్థుల కోసం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాన్ని ప్రతిఒక్కరు ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్, టీఎస్‌యూటీఎఫ్ అర్బన్ మండల ఉపాధ్యక్షుడు కథలయ్య, సహాయ కార్యదర్శి హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

నయా ఫాసిజం అత్యంత ప్రమాదకరం

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ రాములు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ రాములు

మహబూబ్ నగర్ న్యూటౌన్: దేశ ప్రధాని మోదీ అనుసరిస్తున్న నయా ఫాసిజం అత్యంత ప్రమాదకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నాటి సోవిట్ సోషలిస్ట్ ఎర్రసైన్యం ఫాసిజంపై విజయం సాధించి 80 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా జనరల్ బాడీ సమావేశం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానాలను భూస్థాపితం చేయడం ద్వారా ఎర్రజెండా నీడలో రష్యా సోషలిజం ఏర్పాటైందని గుర్తు చేశారు. కమ్యూనిస్టు దేశాలను కూల్చి తిరిగి పెట్టుబడిదారీ వ్యవస్థను తీసుకురావడానికి చేసిన ప్రయత్నాలను నాటి ఎర్రజెండా తిప్పి కొట్టిందన్నారు. పెట్టుబడిదారీ దేశాలు, తమ వ్యవస్థ 10 ఏళ్లకు ఒకసారి సంక్షోభంలోకి వెళ్తాయని నాడు మార్క్స్ అన్న విషయం నేడు అనేక దేశాలలో చూస్తున్నామన్నారు. పుల్వామ దాడి మొదలుకొని నేటి కాశ్మీర్‌లో 28 మంది మరణించడం వరకు పూర్తి బాధ్యత బీజేపీదే అన్నారు. ఇప్పటికైనా పాక్ దుశ్చర్యలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రానిదే అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కురుమూర్తి, పద్మ కిష్టయ్య, కమార్ అలీ, చంద్రకాంత్, ప్రశాంత్, వి జనార్దన్, ఖాజమైనుద్దీన్, భరత్ పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి'

నారాయణపేట: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరాన్ని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ డాక్టర్ రాంకిషన్ ప్రారంభించి మాట్లాడారు. ఆస్పత్రిలో అడ్మిట్ అయిన రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి, రక్తహీనత గల తల్లులకు, ఎమర్జెన్సీ బ్లడ్ ట్రాన్స్‌ఫర్మేషన్ అవసరమయ్యే పేషెంట్లకు ఉపయోగించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయడం వల్ల వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంటుందన్నారు. ప్రాణాపాయ స్థితిలో వారికి పునర్జన్మ ప్రసాదించిన వారు కావాలన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వలంటీర్లు, డోనర్లను అభినందించారు. కార్యక్రమంలో వైద్యులు నరసింహ జీవన్, రాఘవేంద్ర, సుందరిదేవి, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, ప్రభావతి, ఎన్‌టీఏ ప్రెసిడెంట్ కవి, జనరల్ సెక్రటరీ రాజు, షబ్బీర్, ఓం ప్రకాష్, హన్మంతు, విజయకుమార్, దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పరిశీలన



ధనలక్ష్మీకాలనీలో మహిళలను పలకరిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ధనలక్ష్మీ కాలనీ (డివిజన్ నం.9), కృష్ణానగర్ (డివిజన్ నం.22) లో కొత్తగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఏ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. అనంతరం ఎదిర (డివిజన్ నం.4) లోని ఆంధ్రకేసరి యూత్ క్లబ్ భవనం పైఅంతస్తు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు శివశంకర్, హనుమంతు, చెన్నయ్య, నరసింహులు, అశోక్, మల్లేష్, చర్ల శ్రీను, ఆయా కాలనీ వాసులు శ్రీనివాసులుగౌడ్, రాములు, నారాయణచారి, చంద్రశేఖర్, పెంటోజి, బాలరాజ్, బాలయ్యగౌడ్, గంగారాం, జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



మాగనూర్(మక్తల్): మక్తల్ పట్టణంలోని జాతీయ రహదారి 167పై రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులకు రేడియం స్టిక్కర్లు అందజేసినట్లు శుక్రవారం మక్తల్ సీఐ రామ్‌లాల్ తెలిపారు. జాతీయ రహదారిపై రైతులు ధాన్యాన్ని ఆరబెట్టడం వలన రాత్రి సమయాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. జాతీయ రహదారిపై రైతులు ధాన్యాన్ని ఆరబెట్టడం, వాహనాలు పార్కింగ్ చేయకూడదని సూచించారు. రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్ పట్టివేత.. కేసు నమోదు



మాగనూర్: మండల పరిధిలోని నేరడగండొడ్డి గ్రామ శివారులోని ఈతవనంలో 580 గ్రాముల క్లోరల్ హైడ్రేట్(సీహెచ్)ను శుక్రవారం మహబూబ్ నగర్ ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సీహెచ్‌ను నారాయణపేట ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. నిందితుడు ఈడ్గి అశోక్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి, అతడి తల్లిని సైతం అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ కవిత, సిబ్బంది పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



మిడ్జిల్: మండల కేంద్రంలోని దుందుభీ వాగు నుంచి శుక్రవారం తెల్లవారుజామున అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రభాకర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బీసీ మేధావుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఉచితంగా పాలిటెక్నిక్, టీఎస్ఆర్‌జేసీ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ప్రభాకర్ మాట్లాడుతూ అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పదని అన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు 35 రోజుల నుంచి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో తర్ఫీదు ఇప్పిస్తున్నామన్నారు. వారానికి రెండుసార్లు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాలరాజ్, సత్యనారాయణ, ముజాహిద్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.